నమస్తే తెలంగాణ

# మెదక్

I | హైదరాబాద్, బుధవారం 26 మార్చి 2025 | MEDAK


## కాంగ్రెస్ రాగానే తోఫా గాయబ్



మెదక్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో శేరి సుభాష్‌రెడ్డి, ఫరూఖ్ హుస్సేన్, పద్మాదేవేందర్‌రెడ్డి, మధుసూదనాచారి, ముస్లిం మతపెద్దలు

- మైనార్టీల సంక్షేమానికి బీఆర్ఎస్ కృషి
- ముస్లింలకు పెద్దపీట వేసిన కేసీఆర్
- మైనార్టీ పిల్లలకు కేసీఆర్ గురుకులాలు ఏర్పాటు చేశారు..
- కేసీఆర్ సాబ్ దిల్‌వాలే ముఖ్యమంత్రి ఉండే అని అసెంబ్లీలో ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ అన్నారు..
- మెదక్ ఇఫ్తార్ విందులో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 25: బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేండ్లు మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేశామని, ప్రతి రంజాన్‌కు పేద ముస్లింలకు చీరెలు, బట్టలతో కూడిన తోఫా అందజేశామని, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే తోఫాలు మాయమయ్యాయని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. రంజాన్ పవిత్ర మాసం పురస్కరించుకొని మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మెదక్ జిల్లాకేంద్రంలోని క్రిస్టల్ గార్డెన్‌లో నియోజకవర్గ స్థాయి ఇఫ్తారు విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హరీశ్‌రావు, ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, బీఆర్ఎస్ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, దేవేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు భారీసంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రేవంత్ ప్రభుత్వం హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఆరుగ్యారెంటీలు అటకెక్కినట్లు విమర్శించారు. కేసీఆర్ సాబ్ దిల్‌వాలే ముఖ్యమంత్రి ఉండే అని, రంజాన్ తోఫా ఇచ్చేవారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇవ్వడం లేదని అసెంబ్లీలో ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ అన్నారని హరీశ్‌రావు ఈ సందర్భంగా గుర్తుచేశారు. 16 నెలల కాంగ్రెస్ పాలనలో మైనార్టీలకు ప్రభుత్వం ఏమి చేసింది లేదని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వంలో మైనార్టీల కోసం మైనార్టీ గురుకులాలు ఏర్పాటు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని ఇంటిగ్రేటెడ్ పాఠశాలలుగా మార్చి అన్యాయం చేసేందుకు యత్నిస్తున్నట్లు ఆరోపించారు. మైనార్టీల సంక్షేమానికి కేసీఆర్ ఎంతగానో కృషిచేశారని, వారికి కీలక పదవులు ఇచ్చి గౌరవించారన్నారు. ప్రతి రంజాన్‌కు మెదక్‌కు రావడం తనకెంతో సంతోషాన్ని ఇస్తున్నదని హరీశ్‌రావు పేర్కొన్నారు. కార్యక్రమంలో మెదక్, తూప్రాన్ మాజీ మున్సిపల్ చైర్మన్లు మల్లికార్జున్‌గౌడ్, బట్టి జగపతి, రవీందర్‌గౌడ్, జడ్పీ మాజీ ఉపాధ్యక్షురాలు లావణ్యారెడ్డి, మాజీ కౌన్సిలర్లు ఆంజనేయులు, కృష్ణారెడ్డి, సోహేల్, శ్రీనివాస్, సలాం, గౌస్‌ఖురేషి, బీఆర్ఎస్ నాయకులు కృష్ణాగౌడ్, లింగారెడ్డి, బాబుల్‌రెడ్డి, ప్రభురెడ్డి, ఆదర్శ్‌రెడ్డి, బాల్‌రెడ్డి, జుబేర్, ఫాజిల్, మహమ్మద్, అజ్గర్‌అలీ పాల్గొన్నారు.



మెదక్‌లో ఇఫ్తార్ విందుకు హాజరైన ముస్లింలు

## మైనార్టీలపై కాంగ్రెస్ వివక్ష

- ఇఫ్తార్ విందు ప్రవేశపెట్టిన ఘనత కేసీఆర్‌దే..
- ప్రభుత్వం నుంచి రంజాన్ తోఫా అందించి పేద ముస్లింల్లో సంతోషం నింపాం
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, మార్చి 25: మైనార్టీలపై కాంగ్రెస్ సర్కారు పూర్తి వివక్ష చూపుతున్నదని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం రాత్రి దుబ్బాక రెడ్డి సంఘంలో ముస్లింలకు ఆయన ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో మైనార్టీల సంక్షేమానికి సరిపడా నిధులు కేటాయించలేదన్నారు. బీఆర్ఎస్ సర్కారు మైనార్టీలకు పెద్దపీట వేసిందన్నారు. రంజాన్‌కు ముస్లింలకు అధికారికంగా ఇఫ్తారు విందు ఏర్పాటు చేసి, తోఫాలు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నుంచి ఏటా రంజాన్‌కు తోఫా అందించి ముస్లింల కుటుంబాల్లో సంతోషాన్ని నింపామని గుర్తుచేశారు. క్రిస్మస్‌కు క్రైస్తవులకు, బతుకమ్మ పండుగకు హిందువులకు కానుకలు అందించి సర్వమత సామరస్యతను చాటిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే.. బీఆర్ఎస్ మైనార్టీలకు అండగా నిలబడిందని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో దుబ్బాక మసీద్ కమిటీ అధ్యక్షుడు ఖలీల్, బీఆర్ఎస్ నాయకులు రొట్టె రాజమౌళి, ఎల్లారెడ్డి, రవీందర్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, భూంరెడ్డి, ఆస యాదగిరి, స్వామి, బాలకిషన్‌గౌడ్, బండి రాజు, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.



దుబ్బాకలో ఇఫ్తార్ విందులో ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, ముస్లిం మతపెద్దలు

## ప్రయత్నిస్తే సివిల్స్ కష్టమేమికాదు

- సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట టౌన్, మార్చి 25: పట్టుదల, ప్రణాళికాబద్ధంగా చదివితే సివిల్ సర్వీసెస్‌ను సులువుగా సాధించవచ్చని సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి అన్నారు. తెలంగాణ స్కిల్, నాలెడ్జ్ సెంటర్,కెరీర్ అండ్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సివిల్ సర్వీసెస్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ మనుచౌదరి హాజరై మాట్లాడుతూ.. డిగ్రీ చదువుతున్న సమయంలో విద్యార్థులు కెరీర్‌ను ప్లాన్ చేసుకోవాలన్నారు. యూపీఎస్సీ సివిల్ సర్వీస్ పరీక్షలకు సిద్ధం కావాలని అనుకునే వారు ముందుగా పరీక్ష విధానంపై అవగాహన తెచ్చుకోవాలన్నారు. బట్టి విధానంతో కాకుండా విషయ పరిజ్ఞానం పెంచుకొని పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. సబ్జెక్ట్ పరిజ్ఞానం, భాషపై పట్టు పెంచుకుంటే తెలుగులోనూ మెయిన్స్ రాసి, ఇంటర్వ్యూలో అంటెండ్ చేయవచ్చని సూచించారు. నిత్యం వార్త పత్రికలు చదవాలని, కరెంట్ అఫైర్స్ ఫాలోకావాలని, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. అవసరమైన మెటీరియల్ సమకూరుస్తామని తెలిపారు. కలెక్టర్ మనుచౌదరిని అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, వైస్ ప్రిన్సిపాల్ అయోధ్యరెడ్డి, అధ్యాపకులు ఉమా మహేశ్వరి, గోపాల సుదర్శనం, డాక్టర్ మధుసూదన్, సులేమాన్, మదన్‌మోహన్, దాసు, లీలావతి, జగదీశ్వరాచారి, మహేశ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సిద్దిపేటలో సివిల్ సర్వీసెస్‌పై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ మనుచౌదరి



సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండలం ఉట్‌పల్లి శివారులో చెరువు నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలం

# చెరువు.. ఆదెరువయ్యేనా!

## కొత్త చెరువుల నిర్మాణంపై కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు

- బీఆర్ఎస్ హయాంలో నారాయణఖేడ్ నియోజకవర్గానికి 8 చెరువులు మంజూరు
- నాలుగు చెరువుల పనులకు భూసేకరణ పూర్తి
- ముందుకు సాగని పనులు
- మరో నాలుగింటిపై ప్రతిష్టంభన
- సర్కార్ తీరుపై రైతుల ఆవేదన

చెరువు.. పల్లెకు ఆదెరువు అంటారు. ఒక్క చెరువు ఎంతో మందికి ఉపాధిని ఇస్తుంది. చేపల పెంపకంతో మత్స్యకారులు, ముదిరాజ్‌లు ఉపాధి పొందుతుంటారు. చెరువు నీటితో రైతులు పంటలు పండించుకుంటారు. చెరువు కట్టపై ఈత చెట్ల పెంపకంతో గౌడన్నలు కల్లుగీసి అమ్మి జీవనోపాధి పొందుతుంటారు. రజకులు బట్టలను ఉతికి కులవృత్తిపై ఆధారపడి జీవిస్తుంటారు. పశుపక్ష్యాదుల గొంతుతడుపుతుంది చెరువు. నీరు లేనిదే సమస్త జీవరాశులు మనుగడ చాలించలేవు. ఒక్క చెరువు నిర్మాణంతో ఆ ఊరి స్థితిగతులే మారుతాయి. తెలంగాణ ప్రజల జీవన విధానంలో చెరువులకు ప్రముఖ స్థానం ఉన్నది. బీఆర్ఎస్ హయాంలో 'మిషన్ కాకతీయ' పథకంలో అనేక చెరువులను అభివృద్ధి చేసి పూర్వ వైభవం తెచ్చింది. ఇదేకోవలో సాగు నీటి వసతి అంతంతమాత్రంగా ఉన్న సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ ప్రాంత ప్రజలకు ఆదెరువు కల్పించేందుకు అప్పటి సీఎం కేసీఆర్ కొత్త చెరువులు మంజూరు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కొత్త చెరువుల నిర్మాణ పనులు ముందుకు సాగకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు.



సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండలం ఏస్గీ శివారులో చెరువు నిర్మాణ స్థలం

నారాయణఖేడ్, మార్చి 25: వరద నీటిని ఒడిసి పట్టి రైతుల పొలాలకు మళ్లించాలని బీఆర్ఎస్ ప్రభుత్వం సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గానికి 8 కొత్త చెరువుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. నాగల్‌గిద్ద మండలంలోని ఇరక్‌పల్లి-1, ఇరక్‌పల్లి-2, ఉట్‌పల్లి, మోర్గి, ఏస్గి, కేశ్వార్‌లలో నారాయణఖేడ్ మండలం జగన్నాథ్‌పూర్‌లో, కంగ్టి మండలం చుక్కల్‌తీర్థ్‌లలో చెరువుల నిర్మాణానికి రూ.56.47 కోట్ల నిధులు, భూసేకరణ నిమిత్తం మరో రూ.19 కోట్లు అప్పటి సీఎం కేసీఆర్ మంజూరు చేశారు. ఈ చెరువుల నిర్మాణం పూర్తయితే 1810 ఎకరాల ఆయకట్టుకు నీరందే అవకాశం ఉంది. భూగర్భ జలాల వృద్ధికి దోహదం చేయనున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక చెరువుల నిర్మాణాన్ని పట్టించుకోవడం లేదు. దీంతో పనులు ముందుకు సాగడం లేదు.

### నీరుగారుతున్న రైతుల ఆశలు...

కొత్త చెరువుల నిర్మాణ పనుల్లో ఎలాంటి పురోగతి లేకపోవడంతో ప్రజలు నిరాశకు గురవుతున్నారు. భూగర్భ జలాల కొరత తీవ్రంగా ఉన్న నారాయణఖేడ్ ప్రాంతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తలపెట్టిన చెరువుల నిర్మాణం పూర్తయితే ఆయా గ్రామాల పరిస్థితులు మెరుగుపడే అవకాశం ఉంది. కనీసం ఒక్క చెరువు సైతం లేని నాగల్‌గిద్ద మండలంలో ఏకంగా 6 చెరువుల నిర్మాణానికి పూనుకోవడం విశేషం. సాగునీటి వనరుల లేమితో వర్షాధార పంటలపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న ఇక్కడి రైతులకు దశలవారీగా సాగునీటిని చేరువ చేయాలనే కేసీఆర్ గొప్ప సంకల్పంతో కొత్త చెరువుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. చెరువుల నిర్మాణానికి అనువైన ప్రదేశాలను ఎంపిక చేసి 8 చెరువుల నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వం నడుంబిగించింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక చెరువుల నిర్మాణంపై చిన్నచూపు చూస్తున్నది.దీంతో రైతులు నిరాశ చెందుతున్నారు.

### కేసీఆర్ ప్రభుత్వంలోనే సర్వేపూర్తి

8 కొత్త చెరువుల నిర్మాణానికి సంబంధించి కేసీఆర్ ప్రభుత్వం వడివడిగా చర్యలు చేపట్టి సర్వే వేగంగా పూర్తి చేయించింది. చెరువుల పరిధిని నిర్ధారించి చుక్కల్‌తీర్థ్ చెరువు కోసం 27 ఎకరాలు, ఏస్గీ చెరువు కోసం 14 ఎకరాలు, కేశ్వార్ చెరువు కోసం 19 ఎకరాలు, జగన్నాథ్‌పూర్ చెరువు కోసం 7 ఎకరాల మేర భూసేకరణకు అధికారులు చర్యలు చేపట్టారు. చుక్కల్‌తీర్థ్ రైతులకు పరిహారం సైతం అందజేశారు. మిగతా మూడు చెరువుల భూసేకరణకు సంబంధించి నిర్వాసితులకు పరిహారం అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆసక్తి చూపకపోవడం చెరువుల నిర్మాణానికి అవరోధంగా మారింది. ఇరక్‌పల్లి-1, ఇరక్‌పల్లి-2, ఉట్‌పల్లి, మోర్గి చెరువులకు సంబంధించి అప్పట్లోనే సర్వే పూర్తయి భూసేకరణ చేపట్టి పరిహారం అందజేశారు. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రీనోటిఫికేషన్‌కు అడుగులు వేస్తుండడంతో ప్రక్రియ మళ్లీ మొదటికొచ్చి మరింత ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తున్నది. ప్రభుత్వ నిర్ణయంతో 4 చెరువుల నిర్మాణ పనులకు అవరోధంగా మారింది. నిర్వాసితులకు పరిహారం విషయంలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే రైతులతో సంప్రదింపులు జరిపి వారిని సంతృప్తిపర్చి, భూసేకరణ సజావుగా జరిగేలా స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు ఎలాంటి కృషిచేయడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ తీరు చూస్తుంటే కొత్త చెరువుల నిర్మాణం అటకెక్కించినట్లు అనుమానాలు కలుగుతున్నాయి.



బీఆర్ఎస్ హయాంలో నారాయణఖేడ్ మండలం జగన్నాథ్‌పూర్ శివారులో చెరువు నిర్మాణ స్థలంలో సర్వే చేస్తున్న అధికారులు(ఫైల్)

### పనులు త్వరగా పూర్తిచేయాలి



మా గ్రామ శివారులో నిర్మిస్తున్న చెరువు పనులు త్వరగా పూర్తి చేయాలి. మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి కృషి మూలంగానే మా గ్రామానికి చెరువు మంజూరైంది. వెంటనే పనులు ప్రారంభం కావాలనే ఉద్దేశంతో భూపాల్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపి భూనిర్వాసితులకు సకాలంలో పరిహారం అందేలా చర్యలు తీసుకోవడంతో చెరువు పనులు ప్రారంభమయ్యాయి. దశాబ్దాలుగా చెరువు కోసం అనేక ప్రయత్నాలు చేశాం. బీఆర్ఎస్ ప్రభుత్వం మా అభ్యర్థనను పట్టించుకుని చెరువు మంజూరు చేసింది.

-రమేశ్ పాటిల్, మాజీ సర్పంచ్, సుక్కల్‌తీర్థ్

### నిర్వాసితులు పరిహారం తీసుకోవాలి

చెరువుల నిర్మాణానికి సంబంధించి భూములు కోల్పోతున్న నిర్వాసితులు ప్రభుత్వం నిర్దేశించిన పరిహారం తీసుకున్న పక్షంలో చెరువుల పనులు ముందుకు సాగే అవకాశం ఉంది. నిర్వాసితులకు పరిహారం విషయంలో ఏవైనా అభ్యంతరాలుంటే కోర్టు ద్వారా పరిహారం తీసుకునే వీలుంది. పరిహారం సంతృప్తికరంగా లేదని కోర్టు భావించి ఆదేశాలిస్తే కోర్టు ఉత్తర్వుల మేరకు పరిహారం చెల్లిస్తాం. నిర్వాసితులెవరూ పరిహారం విషయంలో ఎలాంటి అపోహలకు లోను కాకుండా చెరువుల నిర్మాణ పనులకు సహకరించాలి.

– విజయభాస్కర్, నీటి పారుదలశాఖ డిప్యూటీ ఈఈ, నారాయణఖేడ్

# 184 ఎకరాల్లో పంటనష్టం

- 120 ఎకరాల్లో జొన్న, 42 ఎకరాల్లో దెబ్బ తిన్న కూరగాయలు
- మామిడిపంటకు తీవ్ర నష్టం
- రైతులను దెబ్బ తీసిన వడగండ్ల వాన
- 33శాతం పంటనష్టం జరిగితేనే ప్రభుత్వ లెక్కల్లోకి
- ప్రభుత్వం తీరుపై సంగారెడ్డి రైతుల ఆగ్రహం



సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో నేలకొరిగిన జొన్న పంట

సంగారెడ్డి, మార్చి 25(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలో ఇటీవల కురిసిన వడగండ్ల వానకు 184 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ ప్రభుత్వానికి ప్రాథమిక నివేదికను అందజేసింది. అంతకంటే ఎక్కువగానే పంటనష్టం జరిగిందని రైతులు చెబుతున్నారు. అకాల వర్షాలు, ఇతర విపత్తుల కారణంగా 33శాతానికి పైగా నష్టం జరిగితేనే వ్యవసాయశాఖ పంటనష్టంగా పరిగణలోకి తీసుకుని ప్రభుత్వానికి నివేదిక అందజేస్తుంది. సంగారెడ్డి జిల్లాలో 500ఎకరాలకు పైగా పంటనష్టం జరిగిందని, అందరికీ పరిహారం అందించాలని రైతులు, రైతుసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. సదాశివపేట మండలంలోని తంగేడుపల్లి, నాగుపల్లి, మునిపల్లి మండలంలోని బుధేరా, మేళాసంగం గ్రామాల్లో 154 మంది రైతులకు చెందిన 184.20 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. అత్యధికంగా వంద మంది రైతులకు చెందిన 120 ఎకరాల్లో జొన్న పంటకు నష్టం వాటిల్లింది. తంగేడుపల్లిలో 40 ఎకరాలు, నాగులపల్లిలో 45 ఎకరాలు, మేళాసంగంలో 35 ఎకరాల్లో జొన్న పంట దెబ్బతింది. 9.2ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నష్టం జరిగింది. తంగేడుపల్లిలో 8 ఎకరాలు, బుధేరలో 1.20 ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లింది. తంగేడుపల్లిలో 4 ఎకరాల్లో గోధుమ పంట దెబ్బతింది. 43 మంది రైతులకు చెందిన 42 ఎకరాల్లో కూరగాయల పంటలకు నష్టం జరిగిం ది. అత్యధికంగా 35 ఎకరాల్లో ఉల్లిగడ్డ, ఆరు ఎకరాల్లో టమాట, మరో ఎకరంలో బెండ దెబ్బతింది. జహీరాబాద్, అందోలు, సంగారెడ్డి నియోజకవర్గాల్లో వందలాది ఎకరాల్లో మామిడి పంటకు నష్టం జరిగితే, అధికారులు కేవలం 15 ఎకరాల్లో నష్టం వాటిల్లిందని ప్రభుత్వానికి నివేదించినట్లు తెలిసింది.



సంగారెడ్డి జిల్లా దవాఖానలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

## విధుల్లో నిర్లక్ష్యంపై కలెక్టర్ కొరడా

- 10 మంది వైద్యులకు షోకాజ్ నోటీసులు
- సంగారెడ్డి జిల్లా దవాఖానలో కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆకస్మిక తనిఖీ

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 25: సంగారెడ్డి జిల్లా కేంద్ర దవాఖానను కలెక్టర్ వల్లూరు క్రాంతి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 9.15 గంటలు దాటినా వైద్యులు, సిబ్బంది విధులకు హాజరుకాక పోవడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హాజరు రిజిస్టర్ పరిశీలించి, ఆలస్యంగా వచ్చిన సిబ్బందిపై చర్యలకు ఉపక్రమించారు. 10 మంది వైద్యులు రోజువారి విధులకు డుమ్మా కొట్టినట్టు గుర్తించి వారికీ షోకాజ్ నోటీసులు జారీ చేయాలని దవాఖాన సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. అనుమతి లేకుండా ఎక్కువ రోజులుగా విధులకు హాజరుకాని వైద్యాధికారులను డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ శాఖ కార్యాలయానికి సరెండర్ చేయాలని ఆదేశించారు. దవాఖానలో వైద్యులు, సిబ్బంది ఉదయం 9.15 గంటల వరకు విధులకు హాజరు కావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతిరోజు వారి హాజరును పరిశీలించాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పలు వార్డులను కలెక్టర్ పరిశీలించి రోగులతో మాట్లాడి సేవలపై అడిగి తెలుసుకున్నారు. వారికి అందిస్తున్న భోజనం, పాలు, బ్రెడ్ నాణ్యతపై ఆరాతీశారు. సీఎస్ఆర్ నిధులతో రోగుల సహాయకుల వసతి భవన నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్ కుమార్, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

# పనులు ప్రారంభమయ్యేనా!

## హుస్నాబాద్‌లో నెమ్మదించిన కూడళ్ల సుందరీకరణ పనులు

- నాలుగు జంక్షన్లకు ఒక్కచోటే పూర్తి
- మూడు ప్రాంతాల్లో నిలిచిన పనులు
- మంత్రి చొరవ చూపాలని ప్రజల విజ్ఞప్తి

హుస్నాబాద్ టౌన్, మార్చి 25: హుస్నాబాద్ పట్టణ సుందరీకరణ పనులు ముందుకు సాగడం లేదు. శంకుస్థాపనలు చేసి ఐదు నెలలు గడిచినా పనుల్లో పురోగతి ఉండడం లేదు. హుస్నాబాద్ పట్టణంలోని గాంధీచౌరస్తా, అంబేద్కర్, నాగారం రోడ్, కరీంనగర్ రోడ్‌లోని మడద వై జంక్షన్ల అభివృద్ధి పనులకు సెప్టెంబర్ 2న బీసీ సంక్షేమం, రవాణాశాఖమంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ శంకుస్థాపన చేశారు. పట్టణంలోని నాలుగు ప్రాంతాల్లో చేపట్టే సర్కిళ్ల అభివృద్ధికి టీయూఎఫ్ఐడీసీ నుంచి రూ.2 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఒక్కో ప్రాంతంలో సర్కిళ్ల అభివృద్ధికి రూ.50 లక్షల చొప్పున నిధులు కేటాయించారు. డీపీఆర్‌ను విఘ్నేశ్ కన్‌స్ట్రక్షన్ ఏజెన్సీకి అధికారులు అప్పగించారు. ఇప్పటి వరకు కేవలం గాంధీచౌరస్తాలో మాత్రమే పనులు పూర్తిచేశారు. మిగిలిన మూడు ప్రాంతాల్లో నేటికీ పనులు ప్రారంభం కాలేదు. ముఖ్యంగా కరీంనగర్, మడద రోడ్డు వద్ద వైజంక్షన్ ఏర్పాటు స్థలం వివాదంతో నిలిచిపోయాయి. ప్రభుత్వ స్థలం కాదని, తమసొంత స్థలంలో పనులు ఎలా చేస్తారంటూ స్థలానికి చెందిన పట్టాదారులు అడ్డుకోవడంతో ఆ ప్రాంతంలో సుందరీకరణ పనులు నిలిచిపోయాయి. అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసే జంక్షన్ అభివృద్ధికి కావాల్సిన స్థలం గురించి ఎవరూ పట్టించుకోక పోవడంతో పనులు మొదలు కాలేదు. దీంతో పాటు నాగారం రోడ్‌లో సైతం జంక్షన్ అభివృద్ధికి సరైన స్థలం సరిపోక ఉన్న స్థలంలోనే ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. కానీ, అక్కడ కూడా సుందరీకరణ పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడడం లేదు. హుస్నాబాద్ పట్టణాన్ని నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతామని మంత్రి పొన్నం ప్రభాకర్ చెబుతున్నారు. కానీ, అభివృద్ధి పనులు వేగంగా జరగడం లేదని విమర్శలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి.



హుస్నాబాద్ పట్టణంలోని కరీంనగర్ రోడ్‌లో నిలిచిన కూడలి సుందరీకరణ పనులు



శంకుస్థాపన చేసిన శిలాఫలకం

### స్థలం వివాదంపై నివేదిక పంపాం

పట్టణంలో పలుచోట్ల సుందరీకరణ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయి. గాంధీచౌరస్తాలో పనులు పూర్తి చేశాం. కరీంనగర్ రోడ్డులో పనులు చేపట్టేందుకు స్థలంపై అధికారులకు నివేదిక పంపించాం. మిగతా ప్రాంతాల్లో త్వరలోనే సుందరీకరణ పనులు చేపడతాం.

– పృథ్వీరాజ్, మున్సిపల్ ఏఈ, హుస్నాబాద్